సాక్షి
ప్రకాశం
బుధవారం ౹ 11 ౹ అక్టోబర్ ౹ 2023



గ్రానైట్ లారీలకు ప్రత్యేక మార్గం

గ్రానైట్ లారీలను ప్రత్యేక మార్గం ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా పంపే అంశంపై పలు శాఖల అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు.

- 10లో..



పనులు ప్రారంభించండి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన పనులకు అనుమతి పొంది వాటిని వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.

- 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
37.3/27.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

12న ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

కనిగిరి రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో బాలికల జట్ల ఎంపిక ఈనెల 12న సంతనూతలపాడు ఎస్ఎస్‌కేఎం జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తారని ఖోఖో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే భాస్కర్ రావు, బీ కాశీ విశ్వనాథరెడ్డి మంగళవారం విలేకర్లకు తెలిపారు. నవంబర్ 25 నుంచి 27 వరకు పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో వీరు పాల్గొని ఆడుతారన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 01-01-2010 తర్వాత జన్మించి ఉండాలి, ఎత్తు, బరువు, వయస్సు మొత్తం 215 పాయింట్లు మాత్రమే ఉండాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు స్థానిక పీడీలు బీ శ్రీనివాసులరెడ్డి, కే మల్లికా రాణిలను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 9849118472, 9640762888 నంబర్లను సంప్రదించాలన్నారు.

బాలుర హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి

నాగులుప్పలపాడు: జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు బాగా శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించాలని అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి అన్నారు. అండర్-14 బాలుర హ్యాండ్ బాల్ క్రీడలకు ఎంపికైన ప్రకాశం జిల్లా జట్టు బాలురకు అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి క్రీడాకారులను అభినందించి రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించేలా శిక్షణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ కృష్ణ, బ్రహ్మయ్య, లీలాకుమారి తదితరులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జిల్లా ఆహార భద్రతా అధికారి ప్రభాకర్



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఆహార భద్రతా అధికారి ప్రభాకర్

టంగుటూరు: నాణ్యతా ప్రమాణాలతో తినుబండారాలు తయారు చేయాలని జిల్లా ఆహార భద్రతా అధికారి గరికపాటి ప్రభాకర్ హెచ్చరించారు. టంగుటూరులోని జిల్లా ఆహార భద్రతా అధికారి ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రతా అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ టంగుటూరులో పలు హోటళ్లు, టీ దుకాణాల్లో నాణ్యత లేని వంటకాలు చేస్తున్నారని, వాటి వలన పలువురికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారం రోజులుగా పలువురి నుంచి ఫిర్యాదులు అందాయని, ఈ మేరకే ఇండియన్ టీ ప్యాలెస్ దుకాణంలో టీపాడి తనిఖీలు నిర్వహించగా, వారు పాల ప్యాకెట్లను ప్లాస్టిక్ కవర్లతో సహా వేడి నీటితో మరిగించటం గుర్తించి, అలా మరిగించటం వలన ప్లాస్టిక్ కవర్లలో ఉన్నవి కరుగుతున్నాయని నోటీసులు జారీ చేశారు. అనంతరం పలు హోటళ్లల్లో నూనె శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతామన్నారు. ప్రజలకు ఆరోగ్య హాని కలిగించే వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పల్లె వాకిట అభివృద్ధి బాట

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం.. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం.. పారిశుద్ధ్యం మెరుగు తదితర మౌలిక వసతుల కల్పనతో పాటు ఇంటి ముంగిటకే వైద్యం, సంక్షేమ పథకాలు.. వేగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పల్లెరూపు రేఖలు మారిపోతున్నాయి. జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా సర్వసభ్య సమావేశంలో చర్చించిన ప్రజా సమస్యల పరిష్కారంపై చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నేతృత్వంలో పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది.

- వైఎస్సార్‌సీపీ వచ్చిన నాలుగేళ్లలో గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు
- పల్లెల్లో తాగునీటి సరఫరా, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, నిరంతర విద్యుత్ సరఫరా
- శరవేగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం
- జిల్లా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు
- 12న జెడ్పీ సర్వసభ్య సమావేశం
- పలు శాఖలపై చర్చించనున్న జెడ్పీటీసీలు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వచ్చిన నాలుగేళ్లలో పల్లెల్లో సిమెంట్, గ్రావెల్ రోడ్లు, తాగునీటి సరఫరా, మంచినీటి సరఫరా ప్లాంటు, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు వంటి పలు అభివృద్ధి జోరుగా సాగుతున్నాయి. అలాగే విద్యార్థుల కోసం పాఠశాలల్లో క్రీడా మైదానాలు, ప్రహరీలు, ఆర్వో ప్లాంట్లు, సంక్షేమ హాస్టల్స్‌లో విద్యుత్ వంటి సమస్యలు అధిగమించేందుకు ఇన్వర్టర్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు, ప్రహరీలు, మంచినీటి వసతి కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నేతృత్వంలోని పాలకవర్గం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించింది. పల్లెల్లో పలు అభివృద్ధి పనులు సైతం చేపట్టింది. గురువారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సందర్భంగా ఇప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక కథనం.



జెడ్పీ నిధులతో దర్శి మోడల్ స్కూలులో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం

పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు:

- జిల్లా పరిషత్ సాధారణ నిధుల కింద 2019-2020 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు 751 పనులకు గాను రూ.4025.44 లక్షల అంచనాలతో పనులు మంజూరయ్యాయి. వీటిలో 307 పనులు పూర్తికాగా, 72 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.1042.50 లక్షలు ఖర్చు చేశారు.
- ఎంపీ నిధులకు సంబంధించి 514 పనులకు రూ.2993.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనుల్లో 396 పనులు పూర్తికాగా, 88 పనులు పురోగతిలో ఉన్నాయి. వాటికి రూ.1203.79 లక్షలు ఖర్చు చేశారు.
- గ్రామీణాభివృద్ధి నిధులు (ఆర్.డీ.ఎఫ్) కింద 17 పనులకు సంబంధించి రూ.310 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనుల్లో 17 పనులు పూర్తి చేయగా, రూ.99.90 లక్షలు ఖర్చు చేశారు.
- పంచాయతీరాజ్ గ్రామీణ రోడ్లకు (పీ.ఆర్.ఆర్) సంబంధించి ఎస్సీ కాంపోనెంట్‌లో మొత్తం 224 పనులకు గాను రూ.2068 లక్షలు మంజూరు చేశారు. ఈ పనుల్లో 224 పనులు పూర్తికాగా, రూ.1420.71 లక్షలు ఖర్చు చేశారు. ఎస్టీ కాంపోనెంట్‌కు సంబంధించి 65 పనులకు గాను, రూ.360 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి 62 పనులు పూర్తికాగా, రూ.257.80 లక్షలు ఖర్చు చేశారు. పీఆర్ఆర్ సాధారణ కాంపోనెంట్‌లో మొత్తం 10 పనులకు గాను రూ.125 లక్షలు మంజూరు చేశారు. ఎం.ఆర్.ఆర్ (మండల గ్రామీణ రోడ్లు) పథకం కింద 9 పనులకు గాను రూ.260.09 లక్షలు మంజూరు చేశారు. ఈ పనుల్లో 9 పనులు పూర్తికాగా, రూ.132.06 లక్షలు ఖర్చు చేశారు.
- అంగన్‌వాడీ భవనాలు (ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులు అనుసంధానంతో) కింద 364 పనులకు గాను రూ.2703.00 లక్షలు మంజూరయ్యాయి. వాటిలో 237 పనులు పూర్తికాగా, 91 భవనాలు పురోగతిలో ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.1535.85 లక్షలు ఖర్చు చేశారు.
- సిమెంట్ రోడ్లకు సంబంధించి 2019-20 ఆర్థిక సంవత్సరానికి గాను 1515 సిమెంట్ రోడ్లకు రూ.14070.13 లక్షలు, గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.3297.50 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులు పురోగతిలో ఉండగా, సిమెంట్ రోడ్లకు రూ.1273.23 లక్షలు, గ్రావెల్ రోడ్లకు రూ.76.29 లక్షలు ఖర్చు చేశారు.
- సిమెంట్ రోడ్లకు సంబంధించి 2020-21 ఆర్థిక సంవత్సరానికి 547 సిమెంట్ రోడ్ల అంచనా విలువ రూ.4839.62 లక్షలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.4836.62 లక్షలు, 8 మెటల్ రోడ్ల నిర్మాణానికి రూ.282.00 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో పనులు పురోగతిలో ఉండగా, సిమెంట్ రోడ్లకు రూ.645.69 లక్షలు, మెటల్ రోడ్ల నిర్మాణానికి రూ.168.41 లక్షలు ఖర్చు చేశారు.
- జగనన్న హౌసింగ్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి సంబంధించి 22 పనులకు గాను రూ.239.41 లక్షలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి 27 పనులకు గాను రూ.78.69 లక్షలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 2 పనులకు గాను రూ.23.00 లక్షలు, సీడీ వర్కుకు సంబంధించి 4 పనులకు గాను రూ.9.03 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో 46 పనులు పూర్తికాగా, 9 పనులు పురోగతిలో ఉన్నాయి. వీటికి ఇప్పటి వరకు రూ.233.99 లక్షలు ఖర్చు చేశారు.
- గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగానికి సంబంధించి సీపీడబ్ల్యూఎస్ స్కీమ్స్ 2023-24 వార్షిక సంవత్సరానికి గాను 28 పనులకు రూ.2319.00 లక్షలు మొత్తానికి ఒంగోలు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు ఇచ్చారు. 28 సీపీడబ్ల్యూఎస్ స్కీమ్స్ ద్వారా 687 ఆవాసాలకు రోజూ నీటి సరఫరా అవుతుంది. ప్రస్తుతం జిల్లాలోని 11 మండలాల్లో 68 ఆవాస ప్రాంతాల్లో 146 ట్యాంకర్ల ద్వారా రోజుకు 657 ట్రిప్పులు నీటి సరఫరా చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం నడుపుతున్న 55 సీపీడబ్ల్యూ స్కీములు సమర్థవంతంగా పనిచేయడానికి, పూర్తిగా మంచినీటి ఎద్దడి నివారణకు 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 కోట్లు కేటాయిస్తారన్నారు.
- గృహ నిర్మాణ శాఖకు సంబంధించి జిల్లాలో మొత్తం 51,055 గృహాలకు గాను, 19,259 ఇళ్లు పూర్తికాగా, 29,771 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.43,108.95 లక్షలు ఖర్చు చేశారు.



తూర్పు చౌటపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువ

సమావేశం అజెండా ఇలా..

ఇరిగేషన్ శాఖ కార్యకలాపాలపై సమీక్ష (ఎన్ఎస్పీ, వెలుగొండ తదితర ప్రాజెక్టులు). గృహ నిర్మాణ, వ్యవసాయ, విద్యా, వైద్య సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాలపై సమీక్షిస్తారు. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, విద్యుత్ శాఖ కార్యకలాపాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తారు.



వాటర్‌ప్లాంట్‌ను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ (ఫైల్)

గ్రామాభివృద్ధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి



గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్, గ్రామీణ రోడ్లు ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజ్, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, క్రీడలు, శ్మశానాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కోసం రూ.50 కోట్లు మంజూరు చేశాం. రాబోయే రోజుల్లో కూడా తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. గ్రామాల్లో మట్టిరోడ్ల స్థానంలో సీసీ రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ కోసం పక్కా సైడ్ కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తాం.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

ఎస్సీ, ఎస్టీలకు సంపూర్ణ న్యాయం

- దోషులకు శిక్ష పడేలా పక్కాగా చర్యలు
- వేగవంతమైన దర్యాప్తుతో మూడొంతుల కేసుల్లో దోషులకు శిక్షలు
- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మంత్రి ఆదిమూలపు సురేష్



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, హాజరైన అధికారులు, సభ్యులు

ఒంగోలు అర్బన్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు త్వరగా సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. మంగళవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మంత్రి సురేష్‌తో పాటు ఎస్పీ మలికాగర్గ్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ కలెక్టర్ శౌర్య పటేల్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. తొలుత గత సమావేశంలో తీర్మానించిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యలను జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ వివరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడుల్లో ఈ చట్టం కింద దోషులపై సాంకేతికంగా సాక్ష్యాల పరంగా ఎటువంటి లోపాలు లేకుండా కేసులు నమోదు చేసి శిక్ష పడేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాధితులకు చట్ట ప్రకారం దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనం కూడా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నమోదైన కేసులు, వాటి దర్యాప్తు స్థితి, దోషులకు శిక్ష, బాధితులకు పరిహారం చెల్లింపు వంటి వివరాలన్నీ ప్రజలకు తెలిసేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ప్రకాశం జిల్లాలో ఇటువంటి సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. కేసుల దర్యాప్తును వివిధ స్థాయిల్లో పూర్తి చేసేందుకు ఎస్ఎల్‌ఏ గడువును కూడా నిర్దేశించాలని సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు సాగర్ నుంచి తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తారన్నారు. ఈ నెలాఖరుకు వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం పనులు పూర్తి చేసేలా చూస్తున్నామని చెప్పారు.

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ భూములకు సంబంధించిన కేసులు ఆరు నెలలుగా గణనీయంగా తగ్గాయన్నారు. ఈ కేసుల పరిష్కారానికి ఆర్డీవోలు, డీఎస్పీలు ప్రతి నెలా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. 20 ఏళ్ల క్రితం మంజూరైన అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు జారీ చేసేందుకు పరిశీలన ప్రక్రియ 90 శాతం పూర్తయిందన్నారు. ఈ భూములను ఆన్‌లైన్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతి నెలా అన్నీ మండలాల్లో పౌర హక్కుల దినం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది మే, జూన్, జులై నెలల్లో 37 అట్రాసిటీ కేసులు నమోదైనట్లు తెలిపారు. బాధితులకు రూ.1,08,50,000 పరిహారం అందించామన్నారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల దర్యాప్తు విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. చార్జ్‌షీట్ దాఖలులో ఎటువంటి లోపాలు లేకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహకారం తీసుకుంటున్నామన్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు 278 కేసులు నమోదయ్యాయని వాటిలో 140 కేసులు పోలీసులు పరిష్కరించినట్లు తెలిపారు.

సభ్యులు పొట్లూరి లక్ష్మయ్య, బొమ్మతోటి రమణమ్మ, పెరిక జయరావు, పందేటి నాగరాజు, గూడురి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు శ్మశానాలకు కేటాయించిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. నకిలీ డాక్యుమెంట్‌లతో ఆక్రమించుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథ రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి, డీఎస్పీలు, తహశీల్దార్‌లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- పోస్టల్ శాఖ విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ జీ శివ నాగరాజు



జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభిస్తున్న విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ జీ శివ నాగరాజు, అధికారులు

ఒంగోలు సెంట్రల్: పోస్టల్ సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఫైనాన్షియల్ సర్వీస్ (పీఎల్ఐఅండ్ ఎఫ్ఎస్) అసిస్టెంట్ డైరెక్టర్ శివ నాగరాజు అన్నారు. ఒంగోలు ప్రధాన తపాలా కార్యాలయంలో మంగళవారం జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా 'విత్య సశక్తి కరణ్ దివాస్' 'జనంలోకి మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ శివ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలను నూతన పోస్టల్ పథకాలతో ఆకర్షించి మెరుగైన సేవలు అందించేందుకు పోస్టల్ శాఖ నూతన కార్యక్రమాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా పొదుపు పథకాలు ఉన్నాయని, వాటి కాలవ్యవధి, టాక్స్ బెనిఫిట్స్ ప్రజలు తెలుసుకుని ఉపయోగించుకోవాలని కోరారు. ఇప్పటికే బ్యాంకు తరహాలో మెరుగ్గా వారి నివాసాల వద్దకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఆధార్ అనుసంధానంగా వారికి నగదు అందిస్తున్నామని తెలిపారు. సుకన్య సంవృద్ధియోజనను అధిక మొత్తంలో నమోదు చేయించిన పోస్టల్ అధికారులను అభినందించారు. విజయవాడ సీపీఎంజీ మేనేజర్ అచ్యుత్ కుమార్ మాట్లాడుతూ పోస్టల్‌లో ప్రతి పైసా సురక్షితమని గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలకు అనువైన డిపాజిట్స్ ఉన్నాయని, ఉపయోగించుకోవాలని కోరారు. ప్రకాశం తపాలా డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ హరి ప్రసాద్ శర్మ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌లో అనేక పథకాల గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ప్రజలకు వివరించాలని చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బీవీఎన్ సురేష్, సీపీఎంజీ ప్రాజెక్ట్ మేనేజర్ అచ్యుత కుమార్, ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ వంశీ క్రిష్ణ, పోస్టుమాస్టర్ రాజేశ్వరి పలు పథకాల గురించి వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఇన్సూరెన్స్ కవర్ చేసిన పోస్టల్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

చేయూతతో మహిళల జీవితాల్లో వెలుగులు




చేయూత మహిళా మార్టును పరిశీలిస్తున్న, వైఎస్ఆర్ క్రాంతిపథం పీడీ టీరవికుమార్‌తో డీపీఎం, ఏపీఎంలు

- మహిళా మార్ట్‌ను పరిశీలించిన పీడీ రవికుమార్

మద్దిపాడు: చేయూత ఇవ్వడం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకే మద్దిపాడు సెక్టార్‌లో వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం పీడీ టీ రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం మద్దిపాడులో ఏర్పాటు చేస్తున్న మహిళా మార్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మార్టు ద్వారా కనీసం పది శాతం వరకూ తక్కువ ధరకు పచారీ సరుకులు, సబ్బులు, పేస్టులు తదితర నిత్యావసర వస్తువులు, దుస్తులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేరుగా కంపెనీల వారితో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా నాణ్యత కలిగిన వస్తువులు ప్రజలకు సరఫరా చేయగలమని, ఈక్రమంలోనే మార్కెట్ ధరకంటే తక్కువకు అందించడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ప్రజల్లో నమ్మకం కలగాలంటే మార్ట్‌ను సందర్శించి రేటు పోల్చి చూసుకోవచ్చని అన్నారు. మహిళా మార్ట్‌ను త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో స్టాక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీఓఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు ఇచ్చేందుకు మహిళా మార్టు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల సభ్యులకు అభినందనలు తెలిపారు. వీఓఏలు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసి నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకు ఇస్తున్న విషయాలను తెలియజేయాలని, అదే విధంగా గ్రూపుల సభ్యులంతా మహిళా మార్ట్‌లోనే సరుకులు తీసుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట డీపీఎం రాంబాబు, ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, ఏపీఎం బత్తుల నరేంద్రం కుమార్, మార్ట్ అధ్యక్షురాలు కేజియా, వీఓఏలు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్లు


కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ అండర్-14, 17 బాల, బాలికల ఎంపికలు కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు 80 మంది బాల, బాలికలు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వనజ, జిల్లా బాస్కెట్ బాల్ సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయిలో జరిగే బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని, కమిటీ ఆర్గనైజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు కె.రవీంద్ర, ఎస్.చిరంజీవి, కె.చిట్టెమ్మ, సుభాషిణి పాల్గొన్నారు.



ఎంపికైన బాలుర జట్లు

ఉమ్మడి ప్రకాశం టెన్నికాయిట్ జట్ల ఎంపికలు

టంగుటూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ అండర్ -14, 17 బాలబాలికల టోర్నమెంట్, సెలక్షన్స్ టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వనజ పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలు, సెలక్షన్స్‌లో ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో అండర్-14 విభాగంలో బాలికలు ఐదుగురు, బాలురు ఐదుగురు, అండర్ -17 విభాగంలో బాలికలు ఐదుగురు, బాలురు ఐదుగురు మొత్తం 20 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ వెంకట్రావు, పీడీలు ప్రసాద్, తుల్లిబిల్లి అశోక్‌బాబు, శ్రీనివాసులు, మురళి, చంద్రశేఖర్, రవికిరణ్‌రెడ్డి, అరుణ, జిల్లా నుంచి 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచి బిళ్లా ఝాన్సీ, పాఠశాల చైర్మన్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలకూరపాడులో రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రేపు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: స్థానిక గాంధీపార్కులో ఈనెల 12న ఉదయం 8 గంటలకు అండర్ 23 ఫెన్సింగ్ యూత్, సీనియర్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 13 ఏళ్ల వయస్సు నిండిన వారు మాత్రమే అర్హులన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని క్రీడాకారులు హాజరుకావొచ్చని, అయితే వారికి ఎఫ్ఏఐ గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలు, కిట్‌తో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 8096909519 లేదా 7671991147 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్‌జీఎఫ్ చెస్
జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో చెస్ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు మంగళవారం స్థానిక గద్దలగుంటలోని ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీలకు 70 మంది బాలికలు, 20 మంది బాలురు హాజరయ్యారు. క్రీడాకారుల ప్రతిభను చెస్ కోచ్ ఆంజనేయులు, టి.రవికుమార్, ప్రదీప్, చెంచయ్యనాయుడు, షకీలా, శ్యామలతోపాటు పాఠశాల పీఈటీ సోమినేని సురేష్‌బాబు పరిశీలించి తుది జట్టును ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ, చెస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు దాది ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు శివకోటిరెడ్డి, ఓరియంటల్ స్కూల్ హెచ్‌ఎం పద్మావతి అభినందించారు.

‘గడప గడపకూ మన ప్రభుత్వం’
పనులను ప్రారంభించండి

● కలెక్టర్ దినేష్‌కుమార్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


మండల కేంద్రాల నుంచి సమీక్షలో పాల్గొన్న అధికారులు

ఒంగోలు అర్బన్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన పనులకు సంబంధించి అనుమతి పొందిన వాటిని వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో ప్రకాశం భవనం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దాని ద్వారా మంజూరైన పనులన్నీ ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు ఉదయం, సాయంత్రం కచ్చితంగా వేయాలని స్పష్టం చేశారు. సేవలకు సంబంధించి నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. సచివాలయాల సర్వీసులను పెంచాలని సూచించారు. జగనన్న గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య శాఖ, జగనన్న స్వచ్ఛ సంకల్పం, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, జగనన్న పాలవెల్లువ తదితర అంశాలపై సమీక్షించారు. వాటిలో మరింత పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీలకు ప్రత్యేక మార్గం!

● సాధ్యాసాధ్యాలను పరిశీలించిన అధికారుల బృందం


భారీ వాహనాల ట్రాఫిక్ మళ్లింపునకు మార్గాన్ని పరిశీలిస్తున్న రవాణాశాఖ ఉపకమిషనర్ సుశీల, ఇతర అధికారులు

ఒంగోలు: జిల్లా రహదారి భద్రతా కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రానైట్ లారీలను ప్రత్యేక మార్గం ద్వారా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పంపే అంశంపై పలు శాఖల అధికారులు మంగళవారం ఉమ్మడి తనిఖీ నిర్వహించారు. ముందుగా రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో చర్చించిన అనంతరం స్వయంగా రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. భారీ వాహనాలు, గ్రానైట్, హిల్ మౌంటెడ్ రాక్స్ లోడుతో కూడిన వాహనాలకు సంబంధించి ట్రాఫిక్ మళ్లింపుపై సాధ్యాసాధ్యాలను అంచనా వేశారు. కర్నూల్ రోడ్డు జంక్షన్ నుంచి కిమ్స్ హాస్పిటల్ జంక్షన్ వరకు రహదారి, ట్రాఫిక్‌ను పరిశీలించారు. రహదారి భద్రత జిల్లా నోడల్ అధికారి, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాస్, పోలీస్ శాఖ, మున్సిపల్, మైనింగ్, ఆర్అండ్‌బీ, రవాణా శాఖ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ తమ నివేదికలను బుధవారం సాయంత్రంలోగా తమకు సమర్పించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల కోరారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.శ్యాంబాబు


జిల్లా జైలులో మాట్లాడుతున్న సైకాలజిస్టు ఏడుకొండలు

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు

ఒంగోలు టౌన్: మానసిక సమస్య అనేది సాధారణ జబ్బుల వంటిదేనని, ఆత్మనూన్యతగా భావించి నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, కె.శ్యాంబాబు అన్నారు. నగరంలోని సిరి మానసిక వైద్యశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యాంబాబు మాట్లాడుతూ మానసిక వ్యాధులను సరైన సమయంలో చికిత్స తీసుకుంటే వ్యాధులను నయం చేసుకోవచ్చన్నారు. ఓర్పు నేర్పుతో మానసిక వ్యాధులకు నాణ్యమైన చికిత్సలు అందజేస్తున్నారని సిరి మానసిక వైద్యశాలకు చెందిన డాక్టర్లను అభినందించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న పలువురు ఇన్‌పేషంట్లతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌లను నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ మధుబిందు సూచించారు. ఇలాంటి వారిని కుటుంబ సభ్యులు, స్నేహితులు ముందుగా గుర్తించి ప్రాథమిక దశలోనే చికిత్స ఇప్పిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. వర్తమాన సమాజంలో మద్యం, గంజాయి, మొబైల్ ఫోన్ అడిక్షన్, ఆన్‌లైన్, బెట్టింగ్‌ల వల్ల వచ్చే సమస్యల గురించి వివరించారు. ఎలాంటి సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదని, ఆత్మహత్య ఆలోచన చేస్తున్న వారు తమ సమస్యలను కుటుంబసభ్యులు, స్నేహితులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.శ్రీదేవి, మేనేజింగ్ డైరెక్టర్ జేఎస్ లక్ష్మణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ఒంగోలు టౌన్:** ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం సైకాలజిస్ట్ ఎస్. ఏడుకొండలు అన్నారు. ప్రపంచ మానసిక దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కారాగారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏడుకొండలు మాట్లాడుతూ..మున్ముందు మానసిక వ్యాధులు మన సమాజంపై విరుచుకుపడే ప్రమాదం ఉందని పలు సర్వేల నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. భారత జనాభాలో పది శాతం మంది వివిధ మానసిక వ్యాధులకు చికిత్సను సంసిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారని తెలిపారు. మత్తు పానీయాలకు అలవాటు పడిన వారి సంఖ్య దేశంలో రూ.29 కోట్ల మంది ఉన్నారని నేషనల్ సర్వే 2019 నివేదికలో పేర్కొన్నట్టు చెప్పారు. 7 లక్షల చిన్నారులు మాదక ద్రవ్యాలను పీలుస్తున్నారని సర్వేలో తేలిందని చెప్పారు. నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో- 2022 ప్రకారం బలవన్మరణాలు కూడా సమాజానికి సమస్యగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపారు. ఏటా 40 లక్షల మంది వరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు తెలుస్తుందని చెప్పారు. మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే సిబ్బందిని జనాభాకు సరిపడా నియమించుకోవాలని ఎస్‌హెచ్ కమిషన్, ఎస్‌హెచ్‌ఆర్సీలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరెండెంట్ పి.వరుణారెడ్డి, జైలు మెడికల్ ఆఫీసర్ డా.బ్రహ్మతేజ, డీఎంహెచ్‌పీ సైకాలజిస్టు డా.చంద్రశేఖర్, జైలర్ వి.రమేష్, సోషల్‌వర్కర్ బి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి


వీరారెడ్డి మృతదేహం

త్రిపురాంతకం: పొలంలో పశువుల గడ్డి కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..త్రిపురాంతకం మండలం అన్నసముద్రం గ్రామానికి చెందిన రైతు దగ్గుల వీరారెడ్డి(70) పొలం వద్ద గట్లపై గడ్డి కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వీరారెడ్డి సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగా అక్కడ విద్యుత్ షాక్ గురైన విషయాన్ని గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోకి 50 కుటుంబాల చేరిక


కండువా కప్పి ఆహ్వానిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: అవినీతి తమకు చేతకాదని, అభిమానించడం మాత్రమే తమకు తెలుసని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక నెహ్రూ నగర్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ బాజీ, షేక్ సాదిక్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరేందుకు వచ్చిన షేక్ మీరామొహిద్దీన్, షేక్ సుభాని, అల్లాభక్షు, అమీర్, వెంకీ, మస్తాన్, కరిముల్లాతోపాటు 50 కుటుంబాలకు బాలినేని ప్రణీత్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు పొత్తులో భాగంగా టిక్కెట్ దక్కుతుందో లేదో అనే సందిగ్ధంలో జనార్దన్ తనను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. తాను ఎవరినైనా బెదిరించినట్లు, అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటానన్నారు. షేక్ బాజీ, షేక్ సాదిక్, మైనార్టీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ సయ్యద్ జలీల్, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బేతపూడి రాజేశ్వరి, మున్నా, బొమ్మినేని మురళి, రాయపాటి అంకయ్య, నాయక్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా బాలినేని ప్రణీత్‌రెడ్డిని ముస్లిం సోదరులు నెహ్రూ నగర్ వరకు భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు.

108లో సురక్షిత ప్రసవం


శిశువును చూపుతున్న గాలిరెడ్డి

కురిచేడు: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన వల్లెం అనంత లక్ష్మి 108లో మంగళవారం సుఖప్రసవమై ఆడశిశువుకు జన్మనిచ్చింది. వివరాలు.. అనంతలక్ష్మికి పురిటినొప్పులు రావడంతో ఆమె కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. త్రిపురాంతకం 108 అంబులెన్స్‌లో ఆమెను తెల్లవారుజామున కురిచేడు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపారు. సిబ్బంది వెన్నా గాలిరెడ్డి ప్రథమ చికిత్స చేయడంతో ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. 108 సిబ్బందిని అనంతలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు. 108 సేవల జిల్లా మేనేజర్ విజయకుమార్, పొదిలి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

రేపు ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న 6 క్రీడాంశాల్లో జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అభ్యర్థులు ఎవరైనా ఎంపిక పోటీలకు హాజరుకావచ్చన్నారు. అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించి సైక్లింగ్ పోటీలను అద్దంకి కాకానిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను జరుగుమల్లి మండలం చిరికూరపాడు జెడ్పీ పాఠశాలలో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను సంతనూతలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, టెన్నిస్ పోటీలను గిద్దలూరులోని క్రీడాప్రాధికార సంస్థ టెన్నిస్ కోర్టులో, రగ్బీ పోటీలను అర్ధవీడులోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదే విధంగా అండర్-14 బాలబాలికల ఖోఖో జట్లను సంతనూతలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 12వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రదేశానికి హాజరుకావాలని సూచించారు. క్రీడాకారుల వివరాలను పీఈటీ/పీడీలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, మాన్యువల్ ఎంట్రీ ఫాంలతో సెలక్షన్‌కు హాజరుకావాలని స్పష్టం చేశారు. అండర్ 17 కేటగిరీలో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా తమ వెంట పదో తరగతి మార్కుల జాబితా, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, ఆధార్ కార్డు, సంబంధిత కాలేజీ/పాఠశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు సమర్పించాలని సూచించారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి


సిద్ధార్థ్‌జైన్‌తో సర్వే ఉద్యోగుల సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రోశిళ్ల చిరంజీవి, నాళం వెంకటేశ్వరరావు తదితరులు మంగళవారం ఆ శాఖ కమిషనర్ సిద్ధార్థ్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పదోన్నతులు, మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు న్యాయం చేయడం, ఇంక్రిమెంట్, సర్వే శాఖకు స్వతంత్ర పాలన.. ఇలా మొత్తం 22 సమస్యలతో కూడిన అర్జీ అందజేయగా కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. సంఘ నాయకులు ఏనుగొండ ఫణినాయుడు, దాసరి సాయిబాబు, ముమ్మన రాజేశ్వరరావు, ఎస్.అప్పలస్వామి, ఎం.సురేష్, గోపాల్, రౌతు రామకృష్ణ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.